# ధాన్యం సేకరణ ప్రక్రియలో వేసవి దృష్ట్యా రక్షణ చర్యలు

### జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ప్రస్తుతం కొనసాగుతున్న తీవ్ర వడగాలులు, ఉష్ణోగ్రతల దృష్ట్యా వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు, సేకరణ పనులను నిర్వహించే సిబ్బంది రక్షించడానికి నిర్దిష్ట చర్యలను తప్పక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, మంచిర్యాల, గద్వాల్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్ వంటి జిల్లాలలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం అత్యవసర హెచ్చరికను జారీ చేసిందని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు నీడ కల్పించేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండేలా చూడాలని, రైతులు, హమాలీలకు వడదెబ్బ తగలకుండా నివారించడానికి చల్లటి తాగునీరు, మజ్జిగ, ఓ.ఆర్.ఎస్. అందించే "చలివేంద్రాలను" ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురి కాకుండా రైతులు తమ ధాన్యాన్ని ఉదయం 11 గంటల లోపు / సాయంత్రం 4 గంటల తర్వాత తీసుకు వచ్చేలా ప్రోత్సహించాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల మధ్య కాలంలో ధాన్యం దించడం, తూకం వేయడం వంటి శారీరక శ్రమతో కూడిన బహిరంగ పనులను పరిమితం చేయాలని, రైతులు ఎండలో వేచి ఉండే సమయాన్ని తగ్గించడానికి, ఖచ్చితమైన టోకెన్ / అపాయింట్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ఐస్ ప్యాక్‌లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక థర్మామీటర్లు కలిగిన ప్రథమ చికిత్స కిట్లు తప్పక అందుబాటులో ఉండాలని తెలిపారు. సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం / 108 అంబులెన్స్ సేవకు సంబంధించిన సంప్రదింపు వివరాలను అందరికీ స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని తెలిపారు. వడదెబ్బ లక్షణాలను గుర్తించేలా అధికారులు, పర్యవేక్షకులకు తగిన శిక్షణ ఇవ్వాలని, కళ్లు తిరగడం / వికారం కలగడం, గుండె వేగంగా కొట్టుకోవడం, గందరగోళం / తీవ్రమైన అలసట లక్షణాల ద్వారా గుర్తించవచ్చని తెలిపారు. వడదెబ్బకు గురైన వారిని ఎటువంటి జాప్యం లేకుండా వెంటనే ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. వడదెబ్బ నుండి కాపాడుకునేందుకు దాహం వేయక పోయినా తరచుగా నీరు త్రాగాలని, టీ / కాఫీకి దూరంగా ఉండాలని, తలను కప్పుకోవడానికి గొడుగులు, టోపీలు / దూది తువ్వాళ్లను వినియోగించాలని, లేత రంగు, వదులుగా ఉండే దుస్తులను ధరించాలని తెలిపారు. ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కాపాడుకోవడానికి మజ్జిగ, నిమ్మరసం వంటి వాటిని వెంట తీసుకువెళ్లాలని తెలిపారు. రైతులు ఎద్దుల బండ్లపై వస్తుంటారని ఈ క్రమంలో జంతువుల కోసం ప్రత్యేక నీడ ఉన్న ప్రదేశాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని, పశువులలో వేడి ఒత్తిడిని నివారించడానికి, వాటి తొట్టెలలో తాజా, చల్లని నీటిని అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొన్ని ప్రదేశాలలో తీవ్రమైన వేడి కారణంగా, అకస్మాత్తుగా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని, ఈ సందర్భంలో వరి తడవకుండా నివారించడానికి టార్పాలిన్‌లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మరి దాన్యం కొనుగోలు ప్రక్రియను ఇలాంటి అవాంతరాలు, అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

# అంగన్‌వాడీ ఫోన్ లపై అవినీతి ఆరోపణలు నిరాధారం

### బీఆర్ఎస్ తప్పుడు ప్రచారంపై ఆత్రం సుగుణక్క ఫైర్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** పోషణ్ అభియాన్ పథకం కింద అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్ల కొనుగోలులో అవినీతి జరిగిందంటూ, ముఖ్యంగా మంత్రి సీతక్కపై బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మ న్నె క్రిశాంక్ చేసిన ఆరోపణలను కుమురం భీం ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ తీవ్రంగా ఖండించారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేతలతో కలిసి మాట్లాడారు.బీఆర్ఎస్ నేతలు రాజకీయ లాభాల కోసం మంత్రి సీతక్క ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఫోన్ల కొనుగోలు పేరుతో అవినీతి జరిగిందన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని స్పష్టం చేశారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ పోషణ్ అభియాన్ పథకం కింద 2025–26 ఆర్థిక సంవత్సరానికి 38,130 స్మార్ట్ ఫోన్ల కొనుగోలును తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ ద్వారా భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జీ ఈ ఎం పోర్టల్‌లో పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పూర్తిగా పారదర్శకంగా టెండర్ ప్రక్రియ నిర్వహించబడిందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బందికి మెరుగైన సాంకేతిక సదుపాయాలు అందించడం ద్వారా సేవల నాణ్యత పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం మంత్రి సీతక్కపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని, వాస్తవాలను వక్రీకరించడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు సుగుణ సూచించారు. ఈ సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షులు ఉబెద్ బిన్ యహియా( తారిక్ ), కట్కార్ భీంరావ్, డీసీసీ జనరల్ సెక్రటరీలు గదివేణి మల్లేష్ , నాంపల్లి శంకర్, మాజీ ఎంపీటీసీ సిడాం తిరుపతి, రాము, మోహన్, తదితరులు పాల్గొన్నారు

# భూభారతి పోర్టల్లో 'విరాసత్'కాలమ్ను చేర్చాలి

**• లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ**: గిరిజనుల భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పోర్టల్లో 'విరాసత్'(వారసత్వ మార్పిడి) కాలమ్ను తక్షణమే చేర్చాలని లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ డిమాండ్ చేశారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన ప్రగతి ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న ఆయన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వపు ధరణి పోర్టల్ స్థానంలో వచ్చిన భూభారతి పోర్టల్లో గిరిజనులకు రెవెన్యూ పరంగా అందాల్సిన విరాసత్ పట్టాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా ఆటోమేటిక్ విధానంలో మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే గిరిజన రైతులు తమ భూములపై హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందని, తరతరాలుగా ఐటీడీఏ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పోడు భూముల పట్టాలను త్వరితగతిన పంపిణీ చేసి గిరిజనులకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, ముఖ్యంగా కొత్తగా రావాల్సిన ఆసరా పెన్షన్లు త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ సమస్యల కారణంగా గ్రామ సర్పంచులు ప్రజలకు సమాధానం చెప్పలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రస్తుతం వారి పరిస్థితి ముందు పోతే నుయ్యి.. వెనక్కి పోతే గొయ్యి అన్నట్లుగా మారిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజన, గ్రామీణ ప్రజల సమస్యలను యుద్ధప్రతిపాదికన పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





**• నేరడిగొండలో 'ప్రజాపాలన మండల స్థాయి సమావేశం**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని సూర్య ఫంక్షన్ హాల్లో గురువారం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఐకెపి సీసీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్థులు హాజరయ్యారు. 2023 డిసెంబర్ నుంచి 2024 మార్చి వరకు మండలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులు తమ శాఖల వారీగా ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, గ్యాస్ సబ్సిడీ, చేయూత పెన్షన్లు, గృహజ్యోతి కింద ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డుల మంజూరు, కళ్యాణ లక్ష్మి , మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు వంటి పథకాల అమలు పై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంత మేరకు చేరుతున్నాయన్న విషయాన్ని అధికారులు గణాంకాలతో సహా వివరించారు. సమావేశ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్టాళ్లను సందర్శించి అక్కడ ప్రదర్శించిన సాగు పద్ధతులు, పోషకాహార విలువల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి పేదవాడికి అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా మొరం తవ్వకాలు

### పట్టించుకోని అధికార యంత్రాంగం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరడిగొండ మండల వ్యాప్తంగా అక్రమ మొరం తవ్వకాలు మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతున్నాయి. కొందరు అక్రమార్కులు ప్రకృతి సహజ సంపదను దోచుకుంటూ కొండలను పిప్పి చేస్తూ యథేచ్ఛగా తవ్వకాలు నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలకు గండి కొడుతూ ప్రకృతి సంపదను తమ సొంత ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారని విమర్శిస్తున్నారు. మండలంలో ఇంత బహిరంగంగా అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ నిఘా పెట్టాల్సిన సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరు చూస్తుంటే వారు ప్రభుత్వ విధులు నిర్వర్తిస్తున్నారా.. లేక అక్రమార్కులకు సహకరిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లుతున్నప్పటికీ కంటికి కనిపించే అక్రమ తవ్వకాలను అరికట్టకపోవడం వెనుక ఉన్న కారణాలు ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొండలను అడ్డగోలుగా తవ్వడం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నేరడిగొండ మండలంలో కొనసాగుతున్న ఈ అక్రమ మొరం తవ్వకాలను అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వహీద్ కుమార్తె వివాహానికి కేటీఆర్కు ఆహ్వానం



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మైనారిటీ మండల అధ్యక్షుడు వహీద్ తన కుమార్తె వివాహానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ను ఆహ్వానించారు. గురువారం హైదరాబాద్లోని కేటీఆర్ నివాసానికి వెళ్లి పెళ్లి పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ వహీద్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వివాహ కార్యక్రమానికి హాజరుకావడానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకట స్వామి, సెస్ డైరెక్టర్ గౌరీనేని నారాయణ రావు, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ విద్యార్థులకు ఘన వీడ్కోలు



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ గురువారం ఘనంగా ఫేర్వెల్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సెకండీయర్ విద్యార్థులు ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహ, లెక్చరర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ ఫైనల్ ఇయర్ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకుని జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. డిగ్రీ పూర్తయ్యాక ఉన్నత విద్యాభ్యాసంతో పాటు మంచి లక్ష్యాలను సాధించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో కూడా ప్రతిభ కనబర్చాలని అన్నారు. హిందీ ప్రొఫెసర్ విద్యార్థులను అభినందిస్తూ రాబోయే చివరి పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులు తమ కళాశాల అనుభవాలను జూనియర్లతో పంచుకుని ఉపాధ్యాయుల బోధన పద్ధతిని ప్రశంసించారు. కాగా విద్యార్థులు గ్రూప్ డాన్సులతో అందరిని ఆకట్టుకున్నారు.

## భీంపూర్లో ప్రజాపాలన సమావేశం



**ఉద్యమ కెరటం, భీంపూర్:** భీంపూర్ మండల కేంద్రంలో ఎంపీడీఓ గోపాల్ కృష్ణా రెడ్డి అధ్యక్షతన గురువారం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్ గోపికిషన్, తహశీల్దార్ బానోత్ రమేష్, ఏఓ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై ప్రణయ్, ఎంపీఓతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామ సర్పంచ్ దాసరి రమేష్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులకు 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక మంచి అనుభవాన్ని అందిస్తోందన్నారు. అన్ని శాఖల అధికారులు కలిసి ఈ కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమాల ద్వారా అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతూ ప్రజలకు మరింత సౌకర్యాలు కల్పించబడుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పని ప్రదేశంలో నీడ సౌకర్యం కల్పించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** వేసవి తీవ్రత దృష్ట్యా పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని ఎంపీడీఓ శేఖర్ అన్నారు. మండల పరిధిలోని వడూర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనుల నాణ్యత, కూలీల హాజరు తదితర అంశాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు పనులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పనుల నమోదులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య, పంచాయతీ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## సోదరి ఇంటికి నిప్పంటించిన దుండగుడు

### రూ.5 లక్షల ఆస్తి నష్టం



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** గుడిహత్నూర్ మండలం ముత్నూర్ గ్రామంలో సొంత సోదరి ఇంటికి నిప్పంటించిన ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన పైటనే సుజాత– సాయికిరణ్ ఇంటికి సోదరుడు పైటనే ధనరాజ్ నిప్పంటించినట్లు పోలీసులు తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిందితుడు పెట్రోల్ కొనుగోలు చేసి ఇంటిపై పోసి నిప్పంటించడంతో సుమారు రూ.5లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను అడ్డు కునేందుకు ప్రయత్నించిన వ్యక్తిని కత్తితో బెదిరించి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఈ సందర్భంగా ఇచ్చోడ సీఐ సీహెచ్ రమేష్ మాట్లాడుతూ నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుంచి పెట్రోల్ బాటిల్తో పాటు వాహనం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చి రిమాండ్కు తరలించినట్లు పేర్కొన్నారు. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట గుడిహత్నూర్ ఎస్సై ఎల్.శ్రీకాంత్ ఉన్నారు.

# ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే పాయల్ శంకర్
- మున్సిపల్ విలీన వార్డుల అభివృద్ధికి రూ.30 కోట్లు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని పరమావధిగా తీసుకుని పనిచేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్టీయూ భవన్లో నిర్వహించిన మున్సిపల్ స్థాయి 'ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక'సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష, వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు 99 రోజుల ప్రణాళికను రూపొందించినట్లు పేర్కొన్నారు. అధికారులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారుల సమస్యలపై తీసుకున్న చర్యల గురించి లేఖల ద్వారా సమాచారం అందించే కొత్త విధానాన్ని మున్సిపల్ అధికారులు ప్రారంభించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో విలీనమైన వార్డుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.30 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పట్టణానికి శాశ్వత నీటి సమస్యను పరిష్కరించేందుకు లాండసాంగ్వి ప్రాజెక్టు పనులను వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అలాగే జూన్ 2 నుంచి 'ఇందిరమ్మ భరోసా బీమా'పథకం ద్వారా మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల బీమా అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్ వరకు అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ ప్రతి శాఖకు వారం రోజుల సమయం కేటాయించి 99 రోజుల యాక్షన్ ప్లాన్ ద్వారా నివేదికలు సిద్ధం చేస్తామని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రుణాల చెక్కులు పంపిణీ చేయడంతో పాటు గర్భిణీలకు శ్రీమంతాలు నిర్వహించారు. అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు అందజేసి, పాలిటెక్నిక్ ప్రవేశాల పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీ ఓ స్రవంతి, మున్సిపల్ కమిషనర్ రాజు, డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, తహశీల్దార్ శ్రీనివాస్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనతో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** ప్రజా పాలనతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. గురువారం కల్లూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా వివిధ అభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్లూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్మికులకు నిత్యావసర సరుకులు, హ్యాండ్ గ్లోవ్స్, సేఫ్టీ డ్రెస్సులు పంపిణీ చేశారు. అనంతరం మున్సిపాలిటీ 2వ వార్డు కప్పల బంధం రోడ్డులో కోట తేజ, మల్లయ్యలకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. తదుపరి కల్లూరు అంబేద్కర్ రోడ్డులో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల విద్య కోసం రూ.51లక్షల 33వేల 550 విలువైన స్కాలర్షిప్ చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



ఫౌండేషన్ ప్రతినిధి రామారావు, కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో అమలవుతున్న 99 రోజుల ప్రణాళికలు గ్రామాలు, పట్టణాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు. అధికారులు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కల్లూరు మండలం రఘునాథ బంజర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా 14 డబుల్ డెస్క్ బెంచీలను అందజేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బోడేమల్లె గ్రామంలో స్వర్గీయ కునుసోతు సోమ్లా నాయక్ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో కల్లూరు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, తహశీల్దార్, మున్సిపల్ చైర్మన్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ నీరజ చౌదరి, వైస్ చైర్మన్ కోటేశ్వరి, సీనియర్ నాయకులు పసుమర్తి చంద్రరావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా, యువజన, ఎన్ఎస్యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- అదనపు డీజీపీ డాక్టర్ అనిల్ కుమార్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని రాష్ట్ర గ్రేహౌండ్స్, ఆక్టోపస్ ఆపరేషన్ అదనపు డీజీపీ డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్.. అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం రిమ్స్ ఆసుపత్రి ఆడిటోరియంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను రక్షించడంలో డాక్టర్లు, పోలీసులు 'లైఫ్ సేవర్స్'గా కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. దేశంలో హత్యల కంటే రోడ్డు ప్రమాదాలతోనే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవ్వడం ఆందోళనకరమని తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. డిఫెన్సివ్ డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్లో వెళ్లకపోవడం, 'స్టాప్–లుక్–ప్రొసీడ్'నియమాన్ని పాటించడం ద్వారా



ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని, ట్రాఫిక్ నియమాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అమలు చేస్తున్న "ట్రిపుల్ ఈ ఫార్ముల" (ఎడ్యుకేషన్, ఎన్ఫోర్స్మెంట్, ఇంజనీరింగ్) విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది జిల్లాలో రోడ్డు ప్రమాద మరణాలను 20 శాతం తగ్గించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డుపై హెల్మెట్ ధరించి తమ పిల్లలతో ప్రయాణిస్తున్న ఇద్దరు వాహనదారులను గుర్తించి, వారికి పిల్లల కోసం ప్రత్యేక హెల్మెట్లు అందజేయడం ఆకట్టుకుంది. అలాగే డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి 25 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అడిషనల్ ఎస్పీ పి.మౌనిక, శిక్షణ ఐపీఎస్ రాహుల్ కాంత్, డీఎస్పీలు శ్రీనివాస్, జీవన్ రెడ్డి, సుమారు 250 మంది రిమ్స్ విద్యార్థులు, వైద్యులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ స్థాయి ప్రజా పాలన సమావేశం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రజాపాలన ప్రత్యేక ప్రణాళికలో భాగంగా మున్సిపల్ స్థాయి సమావేశాన్ని గురువారం ఆదిలాబాద్లోని ఎస్టీయూ భవన్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల శంకర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్, వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మున్సిపాలిటీ తరపున ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వివరాలను తెలియజేశారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఇందులో భాగంగా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రుణాల చెక్కులను అతిథులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణీలకు సీమంతం నిర్వహించి, అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ ఫోన్లు అందజేశారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న వ్యాపారాలకు సంబంధించిన ప్రదర్శన స్టాళ్లను అతిథులు పరిశీలించారు.



ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి పథకాలు చేరేలా 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా శాఖల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి శాఖకు వారం రోజుల సమయం కేటాయించి వారి పనితీరు నివేదికలను ప్రజలకు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ స్రవంతి, ఎల్డీఎం ఉత్పల్ కుమార్ ధమ్, మున్సిపల్ కమిషనర్ రాజు, తహశీల్దార్ శ్రీనివాస్, డీఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్, డీవైఎస్ఓ జక్కుల శ్రీనివాస్, సీడబ్ల్యూఓ మిల్కా, ట్రాఫిక్ ఎస్సై దేవేందర్, కౌన్సిలర్లు అన్నపూర్ణ, స్వాతి, ధోని జ్యోతి, చరణ్ గౌడ్, మున్న జైస్వాల్, గంట జీవన్, విజయ్, ఆత్రం వెంకటేష్, నాగ్ సేన్, మహెబూబ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

